క్లుప్తంగా

ఉపాధి పనులు ప్రారంభం



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక: ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. సోమవారం ఆమె మునగపాకలో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా వలస కూలీలను నివారించవచ్చన్నారు. రహదారులు, చెరువులు, కాలువలు వంటి అభివృద్ధికి ఈ పథకం దోహదపడుతుందన్నారు. కూలీలకు అవసరమయ్యే జాబ్‌కార్డులను అందజేస్తున్నామన్నారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు టెక్కలి పరశురామ్, ఏవీ సత్యనారాయణ, దాడి శివ, ఆడారి లక్ష్మణరావు, విల్లూరి నూక నరసింగరావు, ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి గోవింద పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత చిక్కాల పరామర్శ



పడాల గోవింద్‌ను పరామర్శించిన చిక్కాల రామారావు

పాయకరావుపేట: మండలంలో ఈదటం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పడాల గోవింద్‌ను పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు సోమవారం పరామర్శించారు. ఇటీవల గోవిందు తల్లి మృతి చెందారు. ఈ మేరకు గ్రామంలో గోవిందు ఇంటికి వెళ్లి ఓదార్చి మనోధైర్యం కల్పించారు. పాల్మన్‌పేట సర్పంచ్ కోడ కోటేశ్వరరావు, నాయకులు పల్లేల వెంకట్, కిల్లాడి సత్యనారాయణ, అల్లు చంటిబాబు, మేక శోభన్‌బాబు పాల్గొన్నారు.

చెట్టు భజన కుందు బహూకరణ



ఎస్.రాయవరం: సైతారుపేట రామాలయానికి ఇత్తడి చెట్టు భజన కుందును ఎంపీటీసీ శానాపత్తి రాము బహూకరించారు. శ్రీరామ నవమి వేడుక సందర్భంగా దీన్ని సిద్ధం చేసి ఆలయానికి అందజేసినట్టు ఆయన తెలిపారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక భావం పెంచేందుకు నిత్యం భజన మండలి సభ్యులు కృషి చేస్తున్నారన్నారు. ఈ మేరకు రూ.60 వేలు వెచ్చించి సుమారు 20 కేజీల ఇత్తడితో చెట్టు భజన కుందు తయారీ చేయించానన్నారు.

పారిశుధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ



పారిశుధ్య కార్మికులకు యూనిఫాం అందజేస్తున్న సర్పంచ్

ఎస్.రాయవరం: పంచాయతీ వీధుల్లోకి వచ్చిన పారిశుధ్య కార్మికులకు నివాసితులు సహకరించి చెత్తను అందించాలని సర్పంచ్ కర్రి సత్యనారాయణ కోరారు. తిమ్మాపురంలో పనిచేస్తున్న 10 మంది పారిశుధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ చేశారు. పంచాయతీలో సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్న వారికి ఏటా ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష పూజలు



సింహాచలం: అడవివరంలోని విజినిగిరి పాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్య తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి: మండలంలో పాపయ్య సంతపాలెం శివారులో 20 మద్యం క్వాటర్ బాటిళ్లతో అదే గ్రామానికి చెందిన కె.వెంకటరమణ పట్టుబడినట్లు రూరల్ ఎస్‌ఐ రవి కుమార్ సోమవారం తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని, అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మరుగు.. పరుగు



మునగపాకలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయం

- వేధిస్తున్న మరుగుదొడ్ల సమస్య
- ప్రభుత్వ కార్యాలయాల వద్ద కానరాని సౌకర్యాలు
- సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి కష్టాలు
- సులభ్ కాంప్లెక్స్ వంటి సదుపాయాలు కల్పించాలంటూ వేడుకోలు



వ్యవసాయ కార్యాలయం ఆవరణలో వినియోగంలో లేని బాత్‌రూమ్

మునగపాక: ఆరుబయట మల, మూత్ర విసర్జనకు దూరంగా ఉండాలని, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండాలని సుద్దులు చెప్పే అధికారుల కార్యాలయాల వద్ద పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. నిత్యం ఏదో పనిపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు మరుగు సదుపాయం లేక అవస్థలు పడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారు స్థానికంగా మరుగుదొడ్ల సదుపాయాలు లేక ఆరుబయటకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది.

వినియోగంలోకి రాని వ్యవసాయ కార్యాలయ బాత్‌రూమ్..

మునగపాక వ్యవసాయ కార్యాలయంలో విధులు నిర్వహించే ఉద్యోగులకు బాత్‌రూమ్ సదుపాయం కల్పించారు. ఏళ్ల తరబడి నిర్మాణం కావడంతో నేడు శిథిలావస్థకు గురికావడంతో పాటు వినియోగంలోకి రాకుండా పోయింది. నీటి సదుపాయం లేక బాత్‌రూమ్ నిరుపయోగంగా మారింది. దీనికి తోడు బాత్‌రూమ్ తలుపులు ఊడిపోయాయి. దీంతో సిబ్బంది గత్యంతరం లేక సమీప కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది.

కానరాని మరుగు సౌకర్యాలు

మునగపాక మండల సముదాయాల వద్ద మరుగు సౌకర్యాలు **కానరాలేదు.** దీంతో వివిధ పనులపై **ప్రభుత్వ కార్యాల**యాలకు వచ్చేవారు అసౌక**ర్యానికి గురవు**తున్నారు. మండల పరిషత్, **రెవెన్యూ, విద్యా శాఖ,** వెలుగు, ఉపాధి హామీ **పథకం, పోలీసు స్టేషన్** వంటి ప్రభుత్వ కార్యాల**యాలన్నీ ఒకేచోట** ఉన్నాయి. నిత్యం ఆయా **కార్యాలయాలకు** ఏదో పనిపై నిత్యం ప్రజలు **వస్తుంటారు. ఇక్క**డ స్థానికంగా బాత్‌రూమ్ **సదుపాయాలు లేక** అవస్థలకు గురవుతున్నారు. **సంబంధిత సమస్య**లపై ఎవరికి చెప్పుకోవాలో **తెలియక ఇబ్బందులు** పడుతున్నారు. మహిళలు **ప్రత్యేకంగా అవస్థ**లు పడుతున్నారు. సుదూర **ప్రాంతాల నుంచి** ఉదయం వచ్చి సాయంత్రం వరకు ఉండాల్సిన పరిస్థితుల్లో మరుగు సమస్య వేధిస్తుందని మహిళలు వాపోతున్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి



ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారికి బాత్‌రూమ్ సదుపాయాలు కల్పించాల్సి ఉంది. సుదూర ప్రాంతాల నుంచి పలు పనులపై వచ్చేవారికి అనువుగా ఉండేలా సులభ్ కాంప్లెక్స్ అందుబాటులోకి తీసుకురావాలి. మహిళల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మరుగు సమస్యకు పరిష్కారం చూపాలి.

–రాజాన బుజ్జిబాబు, సామాజిక సేవా కార్యకర్త

చర్యలు తీసుకుంటాం



మండల సముదాయాలకు వివిధ పనులపై వచ్చే వారికి అనువుగా ఉండేలా బాత్‌రూమ్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాం. మరుగు సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా, మల, మూత్ర విసర్జనకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటాం.

–ఎం.ఆదిమహేశ్వరరావు, తహసీల్దార్, మునగపాక

నేడు ఉపమాకలో శివపార్వతుల కల్యాణం

12వ తేదీ వరకు ఉత్సవాలు



ఉపమాకలో శివాలయం

నక్కపల్లి: ప్రముఖ పురాతన శివాలయం ఉపమాకలో భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వర స్వామి వారి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో మురళీకృష్ణ తెలిపారు. ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు స్వామివారి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఆలయంలో గణపతి పూజ, శుద్ధి పుణ్యాహవచనం, అంకురార్పణ, రాత్రి 6.30 నుంచి సప్పరం వాహనంలో పరమేశ్వరుడ్ని పల్లకిలో పార్వతి దేవిని ఉంచి ఎదురు సన్నాహ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. మైలవరభట్ల జోగారావు ఇంటి వద్ద ఎదురు సన్నాహ మహోత్సవం జరుగుతుందన్నారు. ఈ పెళ్లిమాటల తంతును వేదపండితురాలు డాక్టర్ వేదాల గాయత్రీదేవి వ్యాఖ్యానంలో జరుగుతుందన్నారు. పెళ్లి కుమారుడు తరపున నక్కపల్లికి చెందిన శింగంశెట్టి వారి కుటుంబీకులు, పెళ్లి కుమార్తె తరపున ఎం.వి.వి.ఎస్ మూర్తి (సహరా పంతులు) వారి కుటుంబ సభ్యులతో నిర్వహిస్తామన్నారు. అనంతరం శింగంశెట్టి కుటుంబీకులతో ప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. రాత్రి 8.30 నుంచి 10.30 గంటల వరకు స్వామివారి ఆలయంలో తాత్కాలిక కల్యాణ వేదిక వద్ద శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. 9వ తేదీన కుంకుమ పూజ, 10న సదస్యం, 11న తోట ఉత్సవం, 12న పూర్ణాహుతి స్వామివారి పుష్పయాగోత్సవం, పవళింపు సేవ జరుగుతాయన్నారు.

ఇంటర్ విద్యార్థినులకు నోటు పుస్తకాల పంపిణీ



విద్యార్థినులకు పుస్తకాలు అందజేస్తున్న హెచ్‌ఎం, లెక్చరర్లు

యలమంచిలి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సరఫరా అయిన నోటు పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. యలమంచిలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హైస్కూల్ ప్లస్‌లో చదువుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయిని వీవీ హిమబిందు, స్కూల్ యాజమాన్య కమిటీ సభ్యుడు ఆడారి ఆదిమూర్తి, అధ్యాపకులు ఒక్కో విద్యార్థికి 12 నోటు పుస్తకాలు చొప్పున పంపిణీ చేశారు. త్వరలో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తామని హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో పద్మ కుమార్, మువ్వల రాంబాబు, సత్యనారాయణ, పద్మాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధితుల ఖాతాల్లోనే నగదు జమ చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు పరిహారంగా అకౌంట్‌లో నగదు జమ చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని నాగులాపల్లి సచివాలయంలో రోడ్డు విస్తరణ బాధితులతో సోమవారం ఆర్డీవో అయిషా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి విస్తరణకు రైతులంతా ముందుకు వచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. గతంలో నిర్వహించిన గ్రామసభల్లో ప్రకటించినట్లు పరిహారం తప్పకుండా బ్యాంక్ ఖాతాలో జమ చేయాల్సిందేనన్నారు. అంతేగాని టీడీఆర్ బాండ్లు ఇస్తామంటే ఒప్పుకునేది లేదన్నారు. రహదారి విస్తరణకు తామంతా అనుకూలమని, పరిహారం విషయంలో టీడీఆర్ బాండ్లు కాకుండా నేరుగా అకౌంట్‌లో నగదు జమ చేయాలన్నారు. నిర్వాసితులంతా ఒకేమాట ఒకేబాటగా ఉన్నామన్నారు. తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, వీఎంఆర్‌డీఏ అధికారులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న లోవరాజు

ఎస్.రాయవరం: బాలికలకు చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా బాలల సంరక్షణ ప్రతినిధి లోవరాజు తెలిపారు. సోమవారం పెదగుమ్ములూరు గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులను పరిరక్షిస్తూ బాలికలకు ఆదుకునేవిధంగా పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరత్నం, గ్రామ పెద్ద నవీన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు



ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా ఫ్లోరోసిస్ నోడల్ అధికారి డాక్టర్ విశ్వనాథ్

సబ్బవరం: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని ఆరిపాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఫ్లోరోసిస్ వైద్య పరీక్షలు సోమవారం నిర్వహించారు. జిల్లా ఫ్లోరోసిస్ నోడల్ అధికారి డాక్టర్ ఎ.విశ్వనాథ్ ఆధ్వర్యంలోని వైద్య బృందం ఈ పరీక్షలను జరిపింది. విద్యార్థులకు ఫ్లోరోసిస్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఫ్లోరోసిస్ సర్వేకు అనుబంధంగా కమ్యూనిటీ సర్వేలో భాగంగా గృహాలను సందర్శించి, వారి వివరాలను సేకరించి పరీక్షలు, స్క్రీనింగ్ జరిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వి.శ్రీనివాస్, సీహెచ్‌వో స్వర్ణలత, పీహెచ్ఎన్ రత్నబాయి, ఆరోగ్య సూపర్‌వైజర్లు రాంబాబు, చిన్నతల్లి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

గండిపేట వీఎస్ఎస్‌లో అవకతవకలపై ఫిర్యాదు

మాకవరపాలెం: గండిపేట వీఎస్ఎస్‌లో అవకతవకలపై విచారణకు చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు భీమబోయినపాలెం సర్పంచ్ రుత్తల నందకిషోర్ తెలిపారు. అనకాపల్లి సెక్షన్ పరిధిలోని గండిపేట వీఎస్ఎస్ ద్వారా వచ్చే ఆదాయంపై విచారణ చేయాలని సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామన్నారు. మూడేళ్లుగా గండిపేట వీఎస్ఎస్ ద్వారా రూ.లక్షల్లో ఆదాయం వస్తోందన్నారు. ఈ ఆదాయం ఏం చేస్తున్నారో, ఎవరి అకౌంట్‌లో వేస్తున్నారో సభ్యులకు తెలియడం లేదన్నారు. 50 ఎకరాల్లో యూకలిప్టస్ కలప అమ్మకాలు చేశారని, ఈ నగదు సైతం పక్కదారి పట్టిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిబ్రవరిలో డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవని, వీఎస్ఎస్‌పై పూర్తిస్థాయి విచారణ చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పక్కదారి పట్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జాబ్‌మేళాలో 17 మంది ఎంపిక



పలు సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు, కళాశాల సిబ్బంది

సబ్బవరం: విశాఖలోని మద్దిలపాలెం వీఎస్ కృష్ణ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 17 మంది పలు సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సోమవారం తెలిపారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ విజయవాడ వారి ఆదేశాల మేరకు ఈ నెల 4న నిర్వహించిన జాబ్ మేళాలో కళాశాల నుంచి 72 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఫార్మా, ఐటీతో పాటు పలు మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలలో ఈ ఉద్యోగాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు జేకేసీ కోఆర్డినేటర్ బి శంకర్, అధ్యాపకులు అభినందించారు.

ఉత్సాహంగా గుర్రపు పోటీలు



గుర్రం పోటీలను ఆసక్తిగా తిలకిస్తున్న జనం

అచ్యుతాపురం రూరల్ : బోడమాంబిక అమ్మవారి పుట్టుక జాతర సందర్భంగా రామన్నపాలెంలో గుర్రపు పరుగు పోటీలు సోమవారం ఉత్సాహంగా సాగాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో 13 ప్రాంతాల నుంచి రామన్నపాలెంలో నిర్వహించిన గుర్రపు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో రామన్నపాలెం గ్రామానికి చెందిన బోడమాంబిక విక్రమ్ మొదటి స్థానం కైవసం చేసుకుని సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు చేతుల మీదుగా రూ.15వేలు బహుమతి అందుకున్నారు. ద్వితీయ బహుమతి చేనుల అగ్రహారానికి చెందిన మణి జెస్సీకి ఎంపీటీసీ లాలం శ్రీను రూ.12వేలు అందజేశారు. తృతీయ బహుమతి యలమంచిలికి చెందిన మోదమాంబ మురగన్‌కి లాలం సత్తిబాబు రూ.10వేలు అందించారు. నాలుగో బహుమతిగా కోట నందూరుకు చెందిన శివరాజు బ్రదర్స్ రాకీకి రూ.8వేలు అందజేశారు. ఐదో బహుమతిగా కోట నందూరు శివరాజు బ్రదర్స్ చిన్నికి రూ.6వేలు, ఆరో బహుమతిగా వద్దాదికి చెందిన దాసరి శ్రీనుకు రూ.2వేలు నిర్వాహకులు అందజేశారు.

టీబీ ముక్త పంచాయతీగా కె.జె.పురం



అవార్డు అందుకుంటున్న వైద్య సిబ్బంది

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామం టీబీ ముక్త పంచాయతీగా ఎంపికైంది. గ్రామంలో ప్రజలు ఎవరూ టీబీ బారిన పడకుండా ఉన్నట్లు వైద్య సిబ్బంది నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఈ సందర్భంగా కె.జె.పురం పంచాయతీకి గత నెల 24న టీబీ జాతీయ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా అవార్డు ప్రకటించారు. పంచాయతీ కార్యదర్శి నవీన్‌దొర వైద్య సిబ్బందికి అందించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



వాడ్రాపల్లిలో సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు



మునగపాకలో కోలాటం ప్రదర్శిస్తున్న కళాకారులు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి, మునగపాక గ్రామాల్లో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా వాడ్రాపల్లి పెదరామస్వామి ఆలయ ప్రాంగణంలో కోలాటంతోపాటు అన్నమయ్య సంకీర్తనలు నిర్వహించారు. మునగపాకకు చెందిన అన్నమయ్య స్వర తరంగిణి కళాకారులు ఈ ప్రదర్శన ఇచ్చారు. మునగపాకకు చెందిన కోలాటం కళాకారులు శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా పల్లకి ఊరేగింపు సందర్భంగా కోలాటం ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం బాలరాజు



శిక్షణకు హాజరైన వీవోఏలు

మునగపాక: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ఎదగాలని వెలుగు ఏపీఎం బాలరాజు తెలిపారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏలకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. డ్వాక్రా సంఘాలు మరింత బలోపేతం కావాలన్నారు. ఇందుకు వీవోఏలు కృషి చేయాలన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు సక్రమంగా వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. పురుషులతో సమానంగా పోటీ పడి ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. సంఘాల నిర్వహణపై దృష్టిసారించాలని సూచించారు. పొదుపు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. మహిళల జీవనోపాధికి ప్రణాళికలు తయారు చేయాలని చెప్పారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



చూచుకొండ పీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఎస్తేర్‌రాణి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మునగపాక: ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేర్‌రాణి కోరారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని చూచుకొండ, మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్తేర్‌రాణి, విమలగిరిల ఆధ్వర్యంలో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్తేర్ రాణి మాట్లాడుతూ సీజన్‌లో ఎటువంటి రోగాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జంక్‌ఫుడ్స్ జోలికి పోకుండా ఉండాలన్నారు. తాజా ఆహారంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాయకరావుపేట: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అవగాహన కల్పించారు. ఈ అవగాహన ర్యాలీలో వైద్యులు సౌందర్య, పద్మావతి, ఈవో రమణ, హెచ్ఎస్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనదారుల పోరాటంతో దక్కిన ‘ఉపాధి’



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రాము

అచ్యుతాపురం రూరల్: తిమ్మరాజుపేటలో ఉపాధి హామీ పనులు చేపట్టాలని గ్రామ సచివాలయం, ఎంపీడీవో, ఏపీవో కార్యాలయాల ఎదుట పలు దఫాలుగా చేసిన ఆందోళనకు ఫలితం దక్కిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము తెలిపారు. ఈ నెల ఆరంభం నుంచి ఉపాధి పనులు ప్రారంభమయ్యాయన్నారు. గ్రామీణ ప్రజలకు 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.6 వందల కూలి ఇవ్వాలన్నారు. వేసవి ఎండ తీవ్రతకు అనుగుణంగా కూలీలకు టెంట్లు, నీరు వంటి సౌకర్యాలు కల్పించి 15 రోజులకు ఒకసారి కూలి నగదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శరగడం రామనాయుడు, నడుపూరు సన్యాశిరావు, చెల్లుబోయిన అప్పారావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధర ఉపసంహరించుకోవాలి

అనకాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో అధిక ధరలతో సామాన్యుల నడ్డివిరుస్తూ కొత్తగా గ్యాస్ సిలిండర్‌పై రూ.50, పెట్రోల్, డీజిల్‌పై 2 శాతం ఎక్సైజ్ సుంకాన్ని పెంచడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఇచ్చే సిలిండర్ల ధరలను పెంచిన కేంద్ర ప్రభుత్వంపై త్వరలో ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికే నిత్యావసర ధరల పెరుగుదలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారం మోపడం అన్యాయమన్నారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని కోరారు. మోదీ అధికారంలోకి రాక ముందు గ్యాస్ సిలిండర్ ధర రూ.450 ఉంటే, ప్రస్తుతం ధర రూ.850 పెరిగిందని, మరలా మరో రూ.50 పెంచడం ప్రజలపై అధిక బారం మోపడమేనన్నారు. గతంలో లీటరు పెట్రోల్ రూ.63 ఉండగా, ప్రస్తుతం రూ.110 ఉందని విమర్శించారు.

బుడగ జంగాల కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



మంచినీటి సమస్యపై బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

కె.కోటపాడు: కె.కోటపాడులోని బుడగ జంగాలు నివాసం ఉంటున్న కాలనీలో కాలువలు, తాగునీటి సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, యర్రా దేముడు డిమాండ్ చేశారు. గత శుక్రవారం కురిసిన వర్షానికి కాలువల్లో మురుగు జంగాల కాలనీలో వీధుల్లోకి ప్రవహించిందన్నారు. స్థానిక జంగాల కాలనీలో సోమవారం పర్యటించిన వారు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగునీరు కారణంగా తీవ్ర దుర్గంధంతో పాటు అంటువ్యాధులు ప్రబలే పరిస్థితులు ఉన్నాయని రొంగలి ముత్యాలనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. జంగాల కాలనీలో 50 కుటుంబాలు కూడా మూడు వీధి కుళాయిలపైనే తాగునీటికి ఆధారపడాల్సి వస్తుందని చెప్పారు. జల జీవన్ మిషన్ నిధులతో నిర్మాణం జరిపిన ఇంటింటి కుళాయిల నుంచి నీరు ప్రస్తుతం రాలేదని, నీరు వచ్చేలా చేసి ప్రజలకు నీటి కష్టాలను తీర్చాలని ముత్యాలనాయుడు, దేముడు కోరారు. నీటి సమస్యపై స్థానిక బుడగ జంగాల కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. పార్టీ నాయకుడు ఈర్లె నాయుడుబాబు, తదితరులు పాల్గొన్నారు.